క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బంగారునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వావిలపల్లి బంగారునాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు బాధిత కుటుంబాన్ని సోమవారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శశిభూషణరావు, బాబూరావు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

'ఈ-శ్రమ్'లో నమోదు కావాలి



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొండలరావు

రాజాం: అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు అండగా ఈ-శ్రమ్ పోర్టల్ ఉందని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు తెలిపారు. స్థానిక పట్టణంలో పలుచోట్ల సోమవారం పర్యటించిన ఆయన కార్మికులతో కాసేపు మాట్లాడారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న వారంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావాలని సూచించారు. పోర్టల్‌లో నమోదైతే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల బీమా, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష బీమా వర్తిస్తుందన్నారు. మిగిలిన వివరాలకు తమ ఫోన్ నంబర్లు9492555043, 9492555044ను సంప్రదించాలని కోరారు.

భూ సమస్యను పరిష్కరించండి



తహసీల్దారు సులోచరాణికి వినతిపత్రం అందజేస్తున్న దళిత రైతులు

రామభద్రపురం: ఆరికతోట గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యను పరిష్కరించాలని పలువురు దళిత రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై ఎంఆర్‌పీఎస్ నాయకుడు పెంకి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు గ్రామానికి చెందిన 100 మంది దళిత రైతులు సోమవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 366లో గల భూమి దాదాపు 30 ఏళ్లకు పైబడి తమ సాగులో ఉందని, ఆ భూములకు సంబంధించి, పట్టాలు ఇవ్వాలని కోరారు. పట్టాలు ఇప్పించాలని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందించామని, అయినా స్పందించ లేదన్నారు. అనంతరం తహసీల్దారు సులోచనరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిల్లాడ రాజు, కిల్లాడ సింహాచలం పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి అనిత.. సమయస్ఫూర్తితో ఆపదలో నుంచి బయటపడడాన్ని, పలు రక్షణ చట్టాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా చెడు ఉద్దేశ్యంతో మనల్ని తాకితే దానిని బ్యాడ్‌టచ్‌గా పరిగణించి, తక్షణమే అక్కడి నుంచి మెల్లగా వెళ్లిపోయే ప్రయత్నం చేయాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ప్రమాద పరిస్థితుల నుంచి బయటపడే మార్గాలు, ఆశ్రయించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లు తెలియజేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: విద్యార్థులంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఎస్.ఎ ల్.టి.ఎన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని తెలిపారు. జీవితంలో ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనలో ముందుండాలన్నారు. ఉన్నత చదువులు చదివి వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.నర్సింహమూర్తి, ప్రిన్సిపాల్ పి.గోపాలరావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



తెర్లాం: నందబలగ సక్షం అంగన్‌వాడీ కేంద్రంలో టీవీని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ ఆనందరావు



తెర్లాం: జన్నివలస సక్షం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ వాటికను ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయబాబు



రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



బాడంగి: కోటిపల్లిలో పౌష్టికాహారం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రేగిడి: బూరాడలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



బొబ్బిలి రూరల్: మెట్టవలస అంగన్‌వాడీ కేంద్రంలో టీవీని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, తదితరులు



తెర్లాం: నందబలగలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ ఉషారాణి



తెర్లాం: పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తదితరులు

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన సదస్సులు, సమతుల ఆహార ప్రదర్శనలు చేపట్టి, అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని, ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేందుకు, పిల్లలకు మంచి ఆరోగ్యం, వయసుకు తగ్గ ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సక్షం అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసిన టీవీలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు.

–బొబ్బిలి, రాజాం

అక్రమ నిర్మాణాలు ఆపాలి



తహసీల్దారు సులోచనరాణికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి, పాతరేగ, కొత్తరేగ, నరసాపురం గ్రామాలకు వెళ్లే రోడ్డును ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాలను ఆపాలని వైఎస్సార్ సీపీ నాయకులు, దుప్పలపూడి సర్పంచ్ వి.భాస్కరరావు, పాతరేగ సర్పంచ్ గొట్టాపు పైడిపునాయుడు, పాతరేగ మాజీ ఎంపీటీసీ పెద్దింటి పైడిపునాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దారు సులోచనరాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరికతోట జంక్షన్ వద్ద రోడ్డు భాగాన్ని కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులను కలిపి తెలిపినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోట అప్పలనాయుడు, ఎం.సతీష్‌కుమార్, సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారి విగ్రహం తరలిస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలోని గాయత్రి కాలనీలో ఉన్న గాయత్రీదేవి ఆలయం వద్ద అక్టోబరు 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు వాసా జగదీశ్వర శర్మ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సహస్ర కుంకుమార్చనలు, విశేష పూజలు చేయనున్నామన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు..

రాజాం: ఈ నెల 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండపాలు ఏర్పాటు చేసి, దుర్గమ్మ విగ్రహాలను కొనుగోలు చేసి, తరలిస్తున్నారు. దీంతో అన్నిచోట్ల పండగ వాతావరణం నెలకొంది.

ఆక్రమణల సంగతి తేల్చండి

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున జరుగుతున్న ఆక్రమణల సంగతి ముందు తేల్చాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. తొలుత మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, కౌన్సిలర్ ఇంటి గోవిందరావులు ఆక్రమణల అంశాన్ని లేవనెత్తారు. నిరుపయోగంగా పడి ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను కొంతమంది తమ ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే విషయంపై అధికారులను సంప్రదిస్తే ఇప్పుడే కొత్తగా విధుల్లో చేరామని, పరిశీలించి చర్యలు చేపడతామని చెబుతున్నారన్నారు. చోడిగంజి రమేష్‌నాయుడు మాట్లాడుతూ వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, వాటి స్థానంలో అధిక వెలుగునిచ్చే విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోటి చెరువు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోకుండా, ఇళ్ల నిర్మాణాలను అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ ఆక్రమణలు పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత సమావేశంలో ప్రవేశపెట్టిన పలు అంశాలకు సంబంధించి, సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరరావు



రాజాం: పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

బొబ్బిలిరూరల్: గ్రామీణ నీటి సరఫరా విభాగం మండల డీఈగా డి.ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈగా పనిచేసిన పీఎం కే రెడ్డి సాలూరు బదిలీ అయ్యారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రాజాం: సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.జైభీమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీధర్ బదిలీపై అరకు వెళ్లడంతో ఆయన స్థానంలో ఈయన శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట నుంచి వచ్చారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎస్.కృష్ణారావు సోమవారం తెలిపారు. సెప్టెంబరు 28వ తేదీ నుంచి శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. స్విమ్మింగ్ పోటీల్లో పదో తరగతికి చెందిన పల్లి హారిక ప్రియా, ఎనిమిదో తరగతికి చెందిన పల్లి భవానీచాణక్య, ఖోఖో పోటీల్లో తొమ్మిదో తరగతికి చెందిన పొగిరి శరణ్య, పొగిరి వనజాక్షిలు, అథ్లెటిక్స్ పోటీల్లో తొమ్మిదో తరగతికి చెందిన కె.ఆదిలక్ష్మిలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు, పీడీలు జడ్డు హైమావతి, పి.సూరపునాయుడు, సర్పంచ్ కెంబూరి తేజ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ కర్నేన రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న మద్యం దుకాణాల ఉద్యోగులు

రామభద్రపురం: దయచేసి తమను రోడ్డున పడేయవద్దని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్లు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని అన్ని మద్యం దుకాణాలను సోమవారం మూసివేసి, బంద్ పాటించారు. ప్రభుత్వం పాత మద్యం విధానాన్ని రద్దు చేస్తూ షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని వారు తప్పుబట్టారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగులుగా తమను నియమించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేటు దుకాణాలు ఏర్పాటు చేస్తూ తమ పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. అరకొర జీతాలతో కుటుంబ పోషణ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను అనవసరంగా ఉద్యోగాల నుంచి తొలగించొద్దని, ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రాజాం: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం సమావేశమై, పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రీవెన్స్‌కు వస్తున్న ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆయన.. మండలంలోని ప్రధాన సమస్యలను వివరించారు.

పన్నులు వసూలు చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలో ఇంటి పన్ను, నీటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల పన్నులను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో సోమవారం సాయంత్రం సమావేశమైన ఆమె.. ఖాళీ స్థలాల పన్నుల బకాయిల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. 2024 డిసెంబరు 31వ తేదీ నాటికి 65 శాతం, 2025 మార్చి నాటికి 85 శాతం వసూలు చేయాలని తెలిపారు.

సమష్టి కృషితోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యం



వినతిపత్రం అందిస్తున్న ఉత్తరాంధ్ర సాధన సమితి సభ్యులు

రాజాం సిటీ: సమష్టి కృషితోనే ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధన సాధ్యమవుతుందని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉత్తరాంధ్ర సాధన సమితి సభ్యులు సోమవారం ధర్నా నిర్వహించారు. వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్రను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించి, అభివృద్ధికి తోడ్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పాలకుల సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతోనే వెనుకబాటు తనానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా విద్య, వైద్యం, సాగునీటి రంగాల్లో ఇంకా వెనుకబడే ఉన్నామని, తద్వారా ఎంతోమంది యువకులు ఉద్యోగాల రీత్యా వలసబాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే తరాల బంగారు భవిష్యత్ కోసం అందరం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించాలన్నారు. అనంతరం తహసీల్దారు ఎస్‌కే రాజుకు వినతిపత్రం అందించారు.

స్త్రీనిధి రుణాలు అందిస్తాం



ఆన్‌లైన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న స్త్రీనిధి మేనేజర్ సుధాకరరావు

వంగర: రాజాం నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు స్త్రీనిధి ద్వారా రూ.30 కోట్ల రుణం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకరరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పలు సంఘాల మహిళలకు మంజూరు చేసిన స్త్రీనిధి రుణాల రికార్డులను ఆన్‌లైన్‌లో సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 2500 మంది మహిళలకు రూ.18,050 కోట్ల రుణాలు అందించామని, వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు మిగిలిన రూ.11.50 కోట్ల రుణాలు అందిస్తామన్నారు. గ్రేడ్‌ల వారీగా మహిళా సంఘాలకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

'స్నేహం' ద్వారా మరిన్ని సేవలు



సాయిప్రశాంత్‌ను సత్కరిస్తున్న సభ్యులు

రాజాం సిటీ: స్థానిక స్నేహం అసోసియేషన్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవలందిస్తామని అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు తెలిపారు. స్నేహం అసోసియేషన్ 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గతంలో అసోసియేషన్ ద్వారా అందించిన సేవలను గుర్తు చేస్తూ భవిష్యత్‌లో అందించనున్న సేవలపై మాట్లాడారు. అనంతరం స్నేహం సభ్యుడిగా ఉన్న కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ రెడ్‌క్రాస్, మానవతా సంస్థల ద్వారా విద్యారంగంలో అందించిన సేవలకుగాను ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పొట్టా వెంకటేష్ గుప్తా, బీవీ అచ్యుత్‌కుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, ప్రసాద్, కొత్తా ప్రకాష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పిల్లలు బాగా చదివేలా చూడాలి

బాడంగి: ఇంటి వద్ద కూడా పిల్లలు బాగా చదువుకునేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి సూచించారు. ఆ కళాశాలలో సోమవారం జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఆమె.. పలు సూచనలు సలహాలు చేశారు. పాఠశాలలో చెప్పిన అంశాలు ఇంటి దగ్గర నేర్చుకునేలా విద్యార్థులకు సమయం ఇవ్వాలని, వారి చదువును ప్రోత్సహించాలన్నారు. ప్రతిరోజూ పిల్లలు కళాశాలకు వచ్చేలా చూడాలన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు నాణ్యమైన చదువు చెప్పాలని, పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాది వేయాలని కోరారు.

గ్రామసభల్లో 'ఉపాధి' పనులు గుర్తించండి

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గ్రామసభలు నిర్వహించి, ఉపాధి హామీ పథకం పనులు గుర్తించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో సుశీల ఆధ్వర్యంలో ఉపాధి సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు ప్రతీ పంచాయతీలో చేపట్టే ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, వాటికి అవసరమైన ప్రతిపాదనలు తయారీ చేపట్టాలని తెలిపారు. ప్రతీ పంచాయతీల్లో రెండు సార్లు గ్రామసభలు నిర్వహించాలని, పూర్తి స్థాయిలో పనుల నివేదికను తయారు చేయాలన్నారు. ఏయే పనులు గ్రామసభల్లో గుర్తించామో వాటిని క్షేత్ర సహాయకుడు గ్రామసభలో చదివి వినిపించాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఇప్పటివరకు చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, సిటిజన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వేతనదారులకు ఇచ్చే జాబ్ కార్డులపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రతిరోజూ మరుగుదొడ్లు శుభ్రం చేయాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను స్కావెంజర్స్‌తో ప్రతిరోజూ శుభ్రం చేయించాలని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే చర్యలకు వెనుకాడేదిలేదని ఎంఈవో జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని ఆమిటి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన.. పాఠశాలలోని మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, చేతిరాత, హోమ్‌వర్క్ పుస్తకాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని, దుర్వాసన రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రేగిడి: మండలంలోని సంకిలి, ఉంగరాడమెట్ట, రేగిడి, వన్నలి తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి సభ్యుడు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భగవద్గీత గొప్పతనాన్ని సభ్యులు వివరించారు. దసరా పండగ నేపథ్యంలో ఈ ప్రచారం చేస్తున్నామన్నారు. ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడమంటే పది ఇంద్రియాలను జయించడమేనని, ఇదే దసరా పండగ పరమార్థం అన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

రేగిడి: యువత సన్మార్గంలో నడవాలని, అలాంటప్పుడే ఆదర్శవంతమైన సమాజం ఏర్పాటు సాధ్యమవుతుందని ఎస్‌ఐ పి.నీలావతి అన్నారు. సంకల్పం పేరిట మండలంలోని రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించిన ఆమె.. గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం ఉండేలా అందరూ ఐకమత్యంతో మెలగాలని తెలిపారు. ఐకమత్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, ఐకమత్యం లేకుంటే గ్రామాలు విచ్ఛిన్నమవుతాయన్న విషయం అందరూ గుర్తెరగాలన్నారు. సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే గ్రామాల్లోని ప్రజలంతా ఒకే మాట మీద ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజారావు పాల్గొన్నారు.

ప్రత్యేక సమావేశం

బాడంగి: మండల కేంద్రంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులంతా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ డి.సత్యనారాయణతో సోమవారం సమావేశమయ్యారు. మొత్తం 18 పాఠశాలలకు చెందిన సబ్జెక్ట్ టీచర్లు ఈ సమావేశంలో పాల్గొని, ఉపాధ్యాయుల ఆవశ్యకత, అవసరమైన శిక్షణపై చర్చించారు.

సభ్యత్వ నమోదు

సంతకవిటి: ఏపీయూటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) సంతకవిటి మండల శాఖ నాయకులు మండలంలోని పలు పాఠశాలలను సోమవారం సందర్శించి, సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏపీయూటీఎఫ్ స్థాపించి, 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్వర్ణోత్సవాలు నిర్వహించి, పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.